

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా మల్లికార్జున



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా మున్సిపల్ ఉద్యోగల సంఘం నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షులు కృష్ణమోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా రాయచోటి మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉపాధ్యక్షులుగా హరినాథ్, గిరిధర్, కార్యదర్శిగా పాండురంగయ్య , కోశాధికారిగా రెడ్డిమస్తాన్ మదనపల్లి, మొత్తం 17 మంది సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మల్లికార్జున ఎంపికపై జిల్లాలోని మున్సిపల్ ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ చట్టబద్ధమైన, న్యాయపరమైన సమస్యలు ఎప్పటికప్పుడూ ఉన్న తాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి సమస్యల పరిష్కరిస్తామని చెప్పారు.

ఆశా కార్యకర్తలను ఉద్యోగులుగా గుర్తించాలి

- గౌరవ వేతనం రూ.26 వేలకు పెంచాలి
- జిల్లా మహాసభలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభ జరిగింది. ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు జయమ్మ, సుహాసిని, ఫాతీమా అధ్యక్ష వర్గంగా జరిగిన ఈ సభలకు ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరైనారు. ముందుగా సిఐటియు జెండాను ఆవిష్కరించి మహాసభలు అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి గౌరవ వేతనం రూ.26 వేలకు పెంచాలని, పనిభారాన్ని తగ్గించాలని, సెలవులు, మెడికల్ లీవు, మరణించిన ఆశాలకు రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియో, మెటర్నటి లీవు, గ్రూపు ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్స్ సాధనకోసం ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించామని వివరించారు. అనేక పోరాటాల ఫలితంగా ఆశాలకు రూ.పది వేల వేతనం సాధించుకున్నా ఒకసారి ఇవ్వకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇబ్బందులకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. రెండున్నర సంవత్సరాల కాలంలో నిత్యావసర సరుకుల ధరలు 300-400 రేట్లు పెరిగాయని. ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.10 వేలు వేతనం ఏ మూలకు సరిపోవడం లేదని వివరించారు. ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్.పి, సిహెచ్ఒలు చేయాల్సిన ఆశాలకు సంబంధం లేని టెక్నికల్ పనులు, కోవిడ్ టెస్ట్‌లు చేయటం, వ్యాక్సిన్ వేయడం లాంటి పనులు కూడా ఆశలతో చేయిస్తున్నారని, ఎన్‌సిడిసి సర్వే పనులను చేయాలంటూ ఆశా వర్కర్లను వేధింపులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోవిడ్ డ్యూటీలు ప్రారంభమైన నాటినుండి ఆశాలకు పనిభారం ఎక్కువయిందని, టైమింగ్స్ సెలవులు లేవని, 24 గంటలు డ్యూటీ చేయాల్సి వస్తుందని దీని వల్ల నెలకు 3 నుండి 4 వేల రూపాయలు రకరకాలుగా డ్యూటీ సమయంలో ఖర్చు చేయాల్సి వస్తోందని, టిఎ, డిఎలు చెల్లించటం లేదని వివరించారు. ఎన్‌హెచ్ఎమ్ నుండి చెల్లించాల్సిన కోవిడ్ అలవెన్స్ చెల్లించటం లేదని ఆరోపించారు. వర్క్ టెన్షన్ తో అనారోగ్యం పాలయి చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతోందని, చనిపోయిన వారికి ఎటువంటి ఎక్స్ గ్రేషియో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం నాసిరకమయిన సెల్ ఫోన్స్ ఇచ్చి వర్క్ అప్‌లోడ్ చేయమంటుందని, పనిచేయని ఫోన్లు, రీఛార్జ్ కానీ సెల్ ఫోన్స్ తో పని ఎలా చేయాలని ప్రశ్నించారు. ఆశా వర్కర్స్ సమస్యలు, న్యాయమైన డిమాండ్స్ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కన్వీనర్ ఎ.రామాంజులు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టి.హరిశర్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పి.రాజేశ్వరి, ఆశా యూనియన్ నాయకులు మెహరున్నీష తదితరులు ప్రసంగించారు. అన్నమయ్య జిల్లా నలుమూలల నుండి ఆశా కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



ఆశా వర్కర్ల తొలి మహాసభకు హాజరైన కార్యకర్తలు

కన్యకా చెరువు కబ్జా

- పట్టని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- చెరువు కాలువపై వెలసిన నిర్మాణాలు
- సొమ్ము చేసుకుంటున్న కబ్జాదారులు



కన్యకా చెరువు కాలువపై అక్రమంగా నిర్మించిన రూములు

ప్రజాశక్తి-నందలూరు

భావితరాల వారు సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా ఉండాలనే సదుద్దేశంతో పాలకులు చెరువులను, పంట కాలువలను ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో ఖాళీ జాగా ఉంటే చాలు అది చెరువు అయినా, ఏరు అయినా, ప్రభుత్వ భూములు అయినా కబ్జాలతో కుదించుకు పోతున్నాయి. నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో 420 ఎకరాల విస్తీర్ణంలో కన్యకా చెరువు నీటి సౌలభ్యం కోసం ఏర్పాటు చేశారు. కన్యకా చెరువులో యథేచ్ఛగా ఇటుక బట్టీలు, ఇంటి నిర్మాణాలు వెలిశాయి. ఈ కబ్జాలకు ప్రభుత్వం నుండి అందవలసిన కరెంటు, నీరు, ఇతర సౌకర్యాలు కూడా కబ్జాదారులు ఏర్పాటు చేసుకోవడం గమనార్హం. ఏడాదికొకసారి ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వారు చెరువుకు హద్దులు గుర్తించడమే తప్ప కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో కబ్జాదారులు యధేచ్ఛగా చెరువును ఆక్రమిస్తున్నారు. యథేచ్ఛగా కన్యకా చెరువు కబ్జాకు గురవుతున్న రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో కబ్జాదారులకు అధికారులకు సమన్వయం కుదిరినట్లు ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు. ఆర్ఎస్ రోడ్డులోని అన్ని పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. కాలువలను ఆక్రమించి గదులు నిర్మించి అద్దెలకు ఇచ్చి కబ్జాదారులు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. నిత్యం ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ మార్గం గుండా వెళ్తున్న ఈ ఆక్రమణలను పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఆర్ఎస్ రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్అండ్‌బి అధికారుల సమక్షంలోనే కాంట్రాక్టర్లు కాలువలపై బ్రిడ్జిలు నిర్మించకుండా కాలువలను పూడ్చి వేస్తూ రోడ్డు నిర్మించారు. ఈ కాలువలు ఆక్రమణకు గురి కావడం వల్ల నీలపల్లి, విద్యానగర్, గణేష్ నగర్ ,భారత్ గ్యాస్ వెనుకవైపు ఉన్న వందలాది ఇళ్లు మునకకు గురి అయ్యి ప్రజలు వివిధ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెరువు కాలువ ఆక్రమణలను తొలగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



కుచించుకుపోయిన కన్యకా చెరువు

కబ్జాలను తొలగించాలి



కన్యకా చెరువులో అక్రమంగా చేపట్టిన ఇంటి నిర్మాణాలు, ఇటుక బట్టీలను తొలగించి ప్రజలకు త్రాగు, సాగునీటి సౌకర్యాలు పెంపొందించాలి.

- పిట్టల సుబ్బనరసయ్య, బెస్త సంఘం నాయకులు, నందలూరు.

చెరువే ఆధారం



కన్యకా చెరువునే నమ్ముకుని అందులోని చేపలను వేటాడి జీవనం కొనసాగిస్తున్నాం రోజురోజుకు చెరువు కబ్జాల తో కుదించుకుపోవడం తో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే అవకాశంగా ఉంది.

- జింక బాబు, బెస్త సంఘం నాయకులు, నందలూరు.



ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి శివభాస్కర్‌రెడ్డి

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎవరైనా ఆ సాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి శివ భాస్కర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాజంపేట అర్బన్, రూరల్ సర్కిల్‌కు చెందిన 50 మంది పోలీసు అధికారులచే తెల్లవారుజామున ఎన్టీఆర్ కాలనీలో నాకాబంది నిర్వహించారు. అక్రమ మద్యం అమ్మకాలు, గుట్కా విక్రయ ప్రదేశాలలో సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న అనుమానితులను ప్రత్యేకంగా విచారించారు. సుమారు 110 వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులను పరిశీలించారు. గతంలో వేసిన ట్రాఫిక్ జరిమానాలు కట్టకుండా తిరుగుతున్న వాహనదారులచే సుమారు రూ.20 వేలు జరిమానాలు కట్టించారు. అనంతరం గ్రామసభ నిర్వహించి, ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలు గురించి వివరించారు. ఫేక్‌లోన్ యాప్, ఫేక్ బ్యాంక్ కాల్స్, ఎటిఎం నేరాలు, పేస్ బుక్ అకౌంట్‌తో స్నేహం చేసి మోసపోవడం వంటి విషయాలు పట్ల అవగాహన కల్పించారు. జల్సా జీవితం కోసం సులభ పద్ధతిలో అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలన్న కోరికతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పట్టణ సిఐ నరసింహారావు, రూరల్ సిఐ పుల్లయ్య, పట్టణ ఎస్ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, పుల్లంపేట ఎస్ఐ సుబ్బారెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే సంతృప్తి

ప్రజాశక్తి-కలికిరి

సామాజిక ప్రయోజన కార్యక్రమాల్లో తమ వంతు బాధ్యతను నిర్వర్తించినప్పుడే రిటైర్డ్ అయిన ఉద్యోగులందరూ నిజమైన ఆరోగ్యం పొంద గలుగుతారని జిల్లా గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రెసిడెంట్ సి.సురేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంఆర్‌సి ప్రాంగణంలో జిఆర్ ఇఎంలు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు వై.ఆదినారాయణరెడ్డి, వేంపల్లి అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ మాధవసేవ కంటే అభాగ్య మానవుల సేవ జీవితాన్ని చరితార్థం చేస్తుందని వ్యాఖ్యానించారు. ఆ క్రమంలోనే వివిధ రకాల మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. జీవిత చరమాంకంలో రిటైర్డ్ అయిన వారందరూ మానవ సంబంధాలను, మానవీయ విలువలను కాపాడుకోవాలని గుర్తుచేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ మస్తాన్ ఖాన్, ఉపాధ్యక్షుడు జయరాం, కార్యదర్శి దేవేంద్ర, సభ్యులు సుబ్బరాజశెట్టి, శంకర్‌రెడ్డి, సరోజమ్మ, సుబ్బరామయ్య, విశ్వేశ్వరరావు, వేణుగోపాల్, కాంతమ్మ పాల్గొన్నారు.

శ్రీసౌమ్యనాథ సేవా ట్రస్టుకు విరాళం

ప్రజాశక్తి-నందలూరు

జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చారిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్ట్ నిత్య అన్నదానానికి మాధవరం వాస్తవ్యులు కీర్తిశేషులు బోడిచర్ల కృష్ణయ్య జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసులు రూ.25,116 శాశ్వత చందా విరాళం ట్రస్టు అధ్యక్షుడు ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్నకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి శని, ఆదివారాలలో కులమతాలకు అతీతంగా అన్నదానం చేస్తున్నామని తెలిపారు. త్వరలో నిత్యాన్నదానం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పల్లె సుబ్రహ్మణ్యం, జంగం శెట్టి సుబ్బయ్య, సుబ్బరామయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.



అన్నదాన ట్రస్టుకు విరాళాన్ని అందజేస్తున్న శ్రీనివాసులు

ఆదమరిస్తే అంతే...!

ప్రజాశక్తి -కలకడ

ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా అంతే సంగతులు. మండల కేంద్రమైన కలకడకు కూత వేటు దూరంలో ఉన్న చిత్తూరు కర్నూలు-జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు సమీపంలో మురిగు నీరు పోవడానికి ఏర్పాటు చేసిన కాలువకు పెద్ద గొయ్యి ఏర్పడింది. బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో పలు రకాలైన పెద్ద, చిన్న వాహనాలే కాకుండా ద్విచక్ర వాహనాలు సైతం వెళుతూ ఉంటాయి. ఈ క్రమంలో జాతీయ రహదారికి ప్రక్కనున్న ఈ గొయ్యిని చూడకుండా అటువైపు వెళ్ళితే ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి. స్థానికంగా ఉన్న పెట్రోల్ బంకు యజమానులు సైతం చూసి చూడనట్టు వ్యవహరించడం, ఆ దారిలో వెళ్లే అధికారులూ పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. ఏ మాత్రం ఏ మారినా ద్విచక్ర వాహనాలు గొయ్యిలో పడితే ప్రాణాలు సైతం పోవడం ఖాయమని పలువురు భావిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారికి ప్రక్కన ఏర్పడిన గొయ్యిని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వాపోతున్నారు.



ప్రమాదాలకు నిలయంగా మారిన గొయ్యి



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో సిపిఎస్ ఉపాధ్యాయుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో గద్దెనెక్కిన సిఎం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా, ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. సిపిఎస్ రద్దుపై హామీ ఇవ్వని రాష్ట్రాలు సైతం సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ వైపు అడుగులు వేస్తుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం హామీ ఇచ్చి కూడా సిపిఎస్ రద్దు చేయకపోవడం దుర్మార్గమన్నారు. జిపిఎస్ విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఉద్యమాల ద్వారా ప్రభుత్వ మెడలు వంచైనా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయించుకుంటామని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దుపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 10 నుంచి 20 వరకు ప్రతి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుడి ఇంటి వద్దకు వెళ్లి కరపత్రాన్ని అందజేస్తామని, 20 నుంచి 30వ వరకు మినీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా 10 రన్ నిర్వహిస్తామని, డిసెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి సిపిఎస్ పై ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యవంతం చేస్తామన్నారు. జనవరి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడగట్టి సిపిఎస్‌పై పోరుగర్జన నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల విరమణ అనంతరం జీవితానికి భరోసా కోసం పోరాటంలో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు దావుద్దీన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కిరణ్ కుమార్, కరిముల్లా, సుదర్శన్, అయ్యవారు రెడ్డి, చెన్నకేశవులు, బాబు, ఈశ్వర రావు, నిజాముద్దీన్, సునీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేతు విశ్వనాథరెడ్డి

'రాహుల్'కు 40 భాషల్లో ప్రావీణ్యత

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి

కడప అర్బన్: భారత దేశ సామాజిక, సాంస్కృతిక వారసత్వాన్ని తన రచనల్లో శాస్త్రీయంగా పొందుపరచిన రాహుల్ సాంకృత్యాయన్‌కు 40 భాషల్లో ప్రావీణ్యత ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా రాహుల్ సాంకృత్యాయన్ రచనలపై సదస్సు నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'కేతు' మాట్లాడుతూ 140కి పైగా సాహిత్యాలు మనకందించారని పేర్కొన్నారు. జీవితమంతా పర్యటిస్తూ అనుభవాల ద్వారా అనేక నవలలు, కథలు, వ్యాసాలు, ట్రావెలాగ్ వంటివి రాశారని చెప్పారు. బౌద్ధం స్వీకరించి అనేక గ్రంథాలు రాశారని తెలిపారు. భారతీయ మేధావుల్లో ఒకరని కొనియాడారు. సాహితీ స్రవంతి కన్వీనర్ బండి ప్రసాద్ మాట్లాడుతూ 'రాహుల్' రచనలపై సాహిత్య అకాడమీ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యులు ఇరాన్, రష్యా నుంచి వలస వచ్చారని నిరూపించారన్నారు. మాజీ ఎంఎల్‌సి డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ భారతీయ ముస్లిములు ఇండియనైజ్ అవ్వాలని కోరారని చెప్పారు. దీంతో ఆయన కమ్యూనిస్టు పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారని పేర్కొన్నారు. మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. డాక్టర్ వినోదిని రాహుల్ రాసిన లోకసంచారి నవలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో భాస్కర్, సురేష్‌బాబు, వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి, హేతువాది శివారెడ్డి, నాగార్జునరెడ్డి, నిమ్మకాయల శివరాం, అడ్వకేట్ కలీం, రహీం, గణేష్, సిపిఎం సీనియర్ నాయకులు నారాయణ, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, చంద్రశేఖర్, రామయ్య, పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, పౌరహక్కుల సంఘం నాయకులు జానకీ, దస్తగిరి, లోక్‌సత్తా నాయకులు దేవర శ్రీకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, బండి నవీన్ కుమార్, వినోద్ ప్రాల్గొన్నారు.

ఆవాజ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : ఆవాజ్ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని కడప జిల్లా అధ్యక్షులు పఠాన్‌చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందసర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను అభివృద్ధికి దూరం పెట్టిందన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, ముస్లిమలు ఇళ్లపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులను గురి చేస్తున్నారు. లౌకిక ప్రజాస్వామ్య దేశంలో అందరూ సమానమేనని చెప్పారు. ముస్లిముల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి రాజ్యాంగ పరిధిలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ మహాసభలు ఈనెల 30న కడప నగరంలో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహి స్తారని చెప్పారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆవాజ్ మండల అధ్యక్షులుగా షేక్ మౌలాలి, మండల ప్రధాన కార్యదర్శిగా బడే పీరా, సహాయ కార్యదర్శిగా జలీల్, గఫూర్, జాఫర్, మాబుఫీరా, రఫీ, ఉపాధ్యక్షులుగా మాబుపీరా, మున్నీర్‌బాషా, ,మస్తాన్, ఖాదర్‌బాష, కమిటీ సభ్యులుగా నన్నే పీరా గౌసియా బేగం బీబి కోశాధికారి ఖాజావలిని ఎన్నుకున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరందించడమే లక్ష్యం

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ జిల్లా అధికారి పి.వి.ప్రసన్నకుమార్



ముఖా ముఖి..

జిల్లాలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి ఇంటికీ కుళాయిల ద్వారా శుద్ధి తాగునీటిని అందించడమే తమ లక్ష్యమని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌సి పి.వి.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లాలో శుద్ధి చేసిన నీటిని ఎలా సరఫరా చేస్తున్నారో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఆర్‌డబ్ల్యుఎస్ సబ్ డివిజన్‌లో ఎన్ని కార్యాలయాలున్నాయి?

జిల్లాలో రెండు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, 8 సబ్ డివిజన్ కార్యాలయాలున్నాయి. మదనపల్లి, రాజంపేట నియోజకవర్గాల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయాలున్నాయి. రాజంపేట, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, కోడూరు,మదనపల్లి, వాల్మీకిపురం, పీలేరు, తంబళ్ళపల్లి నియోజకవర్గంలో సబ్‌డివిజన్ కార్యాలయాలున్నాయి.

ప్రస్తుతం జరుగుతున్న పనులు వివరాలు తెలపండి?

ప్రస్తుతం అన్నమయ్య జిల్లాలో జల్ జీవన్ మిషన్ పథకం కింద 6634 పనులకు గాను రూ.23141.71 లక్షలు మంజూరయ్యాయి. అందులో 1467 పూర్తయ్యాయి. 813 పురోగతిలో ఉన్నాయి. 2584 ఇంకా పనులు ప్రారంభం కాలేదు. 1402 మండల ప్యాకేజీ టెండరు దశలో ఉన్నాయి. జగనన్న హౌసింగ్ కాలనీలకు గాను జల్ జీవన్ మిషన్ పథకం కింద మెదట విడతలో 270 పనులకు గాను రూ.744.57 లక్షలు మంజూరయ్యాయి. రెండవ విడతలో 204 పనులకు గాను రూ.127.88 లక్షలు మంజూరయ్యాయి. రెండు విడుదలకు సంబంధించి 189 కాలనీలలో రూ.4033.62 లక్షలు మంజూరయ్యాయి.

జల్ జీవన్ మిషన్ లక్ష్యాలు తెలియజేయండి?

సిబిఐఎం(జి) గ్రాంట్ కింద సిఎంసిఎస్ రూ.1236.00 లక్షలు మంజూరయ్యాయి. జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా మంచినీటిని అందిం చడమే లక్ష్యంగా ఉంచుకున్నాం.

కేంద్ర ప్రభుత్వం ఎంత నిధులు మంజూరు చేసింది?

కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ.1477.57 లక్షలు మంజూరు చేసింది.

పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంత నిధులు మంజూరు చేశాయి?

కేంద్ర ప్రభుత్వం రూ.147.57 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.1477.57 లక్షలు ఇప్పటి వరకు మంజూరు చేశాయి. రూ.2955, 14 లక్షలు మంజూరైనవి. జిల్లా వ్యాప్తంగా పథకానికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. పనుల నాణ్యతగా లేవన్న విషయం మా దృష్టికి ఇంకా రాలేదు. వస్తే పరిష్కరిస్తాం. జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రస్తుతం బిల్లులు ఎలాంటి జాప్యం లేకుండా మంజూరు చేస్తున్నాం.

గ్రామ స్థాయిలో ట్యాంకులను పరిశుభ్రత చేస్తున్నారా?

గ్రామాల్లో ట్యాంకులు శుభ్రం చేయించే బాధ్యత పంచాయతీలవి. ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రంచేయాలి. వాటిని మా ఎఇలు పర్యవేక్షిస్తారు. కాబట్టి గ్రామాల్లో ట్యాంకులు ప్రతి నెలా శుభ్రం చేయిస్తాం.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్‌ఖాన్

భక్తి శ్రద్ధలతో గ్యార్మీ పండుగ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

స్థానిక హజరత్ ఖాజాపీర్ మస్తాన్ వలి దర్గాలో ఆదివారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో గ్యార్మీ పండుగను నిర్వహించారు. హజరత్ మహబూబ్ సుభాని జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, పిసిసి కార్యదర్శి ఆఘా మొహియుద్దీన్, పీలేరు నియోజకవర్గ వైసిపి మైనార్టీ నేత అబ్దుల్ కలీమ్‌లు దర్గాలో చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అబ్దుల్ అజీమ్, గఫార్ ఖాన్, జావాద్ హుస్సేన్, కరీం సాహెబ్, రషీద్ సాహెబ్, జాకీర్ హుస్సేన్, గౌస్ ఖాన్, జబ్బార్ సాహెబ్, తాహీర్, సైఫుల్లా, అక్బర్ హుస్సేన్, సాధిక్, ఇర్ఫాన్, షాహెద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి- కలకడ

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించినట్లు సింగల్ విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి, ఎంపిడిఒ సిహెచ్ నారాయణలు తెలిపారు. ఉదయం 6 గంటల నుండి గుడిబండ పంచాయతీ ఎల్లం గుడిబండ నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల, సచివాలయ స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.


పిఆర్‌పి మునిరాజును సన్మానిస్తున్న రైతులు

పిఆర్‌పి మునిరాజు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అవగాహన కల్పించడంలో పిఆర్‌పి మునిరాజు సేవలు అభినందనీయమని మండలంలోని అయ్యవారిపల్లి రైతులు కొనియాడారు. గత ఆరు సంవత్సరాలుగా విధులు నిర్వర్తించి, బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం అయ్యవారిపల్లిలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మునిరాజుని రైతులు దుశ్శాలవతో సన్మానించారు. అనంతరం లెవల్ 2 స్వాతి మాట్లాడుతూ కమ్యూనిటీ నేచరల్ ఫామింగ్ ప్రాజెక్టు ద్వారా రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహనలు కల్పించి, ప్రకృతి వ్యవసాయంలో రైతులకు మంచి లాభాలు వచ్చేలా సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్2లు హేమలత, యల్లారెడ్డి, రమేష్ రెడ్డి, అనురాధ, ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

11 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 11 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, కె.వి.పల్లె, యర్రావారి పాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులను పరీక్షించి ర్హులైన 11 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, శశిబిందు ,ఆప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-రామాపురం

మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని రాయచోటి నియోజకవర్గం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి అన్నారు మండలంలోని గోపగుడిపల్లె పంచాయతీ గొల్లపల్లెకు చెందిన టిడిపి కార్యకర్త వెంకటేష్ గుండె పోటుతో మరణించిన విషయం తెలిసి ఆదివారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎంఎల్‌హెచ్‌పిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప సిటి

వైద్య ఆరో గ్య శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరమ్మ ఆధ్వ ర్యంలో జోన్-4 ప్రాం తీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉమ్మడి నాలుగు జిల్లాల జోన్-4 పరిధిలో(ఎంఎల్ హెచ్‌పి) మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ల ఉద్యోగులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. 391 పోస్టుల మంజూర్వగా రీజనల్ పరిధిలో 292 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 271 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 22 మంది తప్పా మిగతా వారంతా విజయవాడలో రిపోర్ట్ చేయాలన్నారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం

మదనపల్లె అర్బన్: నేరాల నియంత్రణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని టూ టౌన్ సిఐ ఎస్.మురళీకృష్ణ తెలిపారు. ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నీరుగట్టువారిపల్లి, రాజానగర్, రెడ్డీస్ కాలనీలలో మదనపల్లె సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి మదనపల్లె కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ ప్రాంతాలలో సోదాలు నిర్వహించి రికార్డులు సరిగ్గా లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి ఇంటిని అద్దెకు అడిగినప్పుడు ఆధార్ కార్డు, వారి యొక్క అడ్రస్ ప్రూఫ్ వివరాలు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా ఆ ప్రాంతంలో తిరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని మీ యొక్క వాహనాల రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్డెన్‌సెర్చ్‌లో మదనపల్లె సబ్‌డివిజన్ ఎస్ఐలు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయ భవనానికి భూమిపూజ

రాయచోటి టౌన్: పట్టణంలోని పడిగ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయబోయే వైసిపి కార్యాలయ భవన నిర్మాణానికి ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. సంప్రదాయకంగా వేదపండితులు శ్రీకాంత్‌రెడ్డిచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్‌సిపి మైనార్టీ నాయకులు బేపారి మహమ్మద్ ఖాన్, మాజీ ఎంపిపి పోలి సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పిల్లల మానసిక వికాసానికి 'కిడ్స్ హెవెన్ ప్లే జోన్'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పెద్దలు రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించేది పిల్లల కోసమే. వారి పిల్లలకు బంగారు భవిష్యత్తును ఇవ్వాలని, వారు ఆరోగ్యంగా వయసుకు తగినట్లు శరీరకంగా, మానసికంగా ఎదుగుతూ ఉండటే చూసి తాము పడ్డ శ్రమను పూర్తిగా మరచిపోయి ఖాళీ దొరికిన కాస్త సమయంలో తమ పిల్లలను ముద్దు చేస్తూ సంబరపడిపోతుంటారు. ఉరుకుల, పరుగుల జీవితంలో తాము ఏ పిల్లల కోసమైతే ఒళ్ళు గుల్ల చేసుకుని శ్రమిస్తున్నారో ఆ పిల్లల కోసం సమయాన్ని కేటాయించలేక, పిల్లల్ని ఆటపాటలకు దూరం చేస్తూ అనేకమంది పిల్లల్లో మానసిక, శారీరక సమస్యలకు కారణమవుతున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువే పరమావధిగా భావించి తమ పిల్లల్ని పుస్తకాల పురుగులను చేస్తూ వారిలో అనేక రకాల రుగ్మతలు కలిగేలా పెద్దలు ప్రవర్తిస్తున్నారు. సెలవు దినాలు, ఖాళీ సమయాలలో తమ పిల్లలకు ఆటవిడుపు ఉండాలన్న ఆలోచన ఉన్నప్పటికీ నిరంతరాయంగా శ్రమించిన తల్లిదండ్రులకు దొరికిన ఒక్కరోజు సెలవులో ఇంటి పనులకే సమయం చాలక పోవడంతో పిల్లల కోసం సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. పిల్లల్లో శారీరక, మానసిక సమస్యలెన్నో తలెత్తి బంగారు భవిష్యత్తును పసితనంలోనే నాశనం చేసుకుంటున్నారు. వీటన్నిటికీ చెక్ పెడుతూ పిల్లల మానసిక వికాసానికి, శారీరక ఎదుగుదలకు దోహదపడేందుకు శివ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్య గురువు పెనిగలపాటి శివప్రసాద్ చౌదరి ఏర్పాటు చేసిన కిడ్స్ హెవెన్ ప్లే జోన్ పిల్లలకు ఆటవిడుపుగా, తల్లి దండ్రులకు భరోసాగా మారిందనడంలో సందేహం లేదు. పిల్లలకు ఆసక్తి కలిగించే విధంగా, ఆకర్షణీయంగా ఏర్పాటుచేసిన ప్లే జోన్ కేంద్రంలో సుశిక్షితులైన మహిళా కేర్ టేకర్‌లే పిల్లల్ని ఆడించడంతో పాటు వారికి సంబంధించిన పుట్టినరోజు వేడుకలు అబ్బురపరిచే విధంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కేంద్రాన్ని ఏర్పాటు చేసిన అతి తక్కువ కాలంలోనే ప్రజల మన్ననలు పొందగలిగారంటే ప్లే జోన్ కేంద్రంలో నిర్వాహకుల పని తీరే కారణమని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. అనతి కాలంలోనే పట్టణంలోని కిడ్స్ హెవెన్ ప్లే జోన్ మండల వ్యాప్తంగా ప్రజలకు చేరువయిందనడంలో సందేహం లేదు.


ప్లే జోన్ కేంద్రంలో సరదాగా ఆడుకుంటున్న పిల్లలు

వైసిపి పాలనలో రాష్ట్రం సుభిక్షం


కలికిరి : కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వైసిపి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఎంపిపి నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వైసిపి ఇన్‌ఛార్జి ఆర్.ఐ.రమణారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభించి నేటికీ ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక సింగల్ విండో కార్యాలయం వద్ద మండల కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు కలసి రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపిటిసి రెడ్డివెంకటేష్, నాయకులు నవీన్, శంకర, గంగాధర, బొట్టు రమణ, నాగరాజా, శ్రీనివాసులు, మౌలాలి పాల్గొన్నారు. **కలికిరి:** ఎంపిపి నూర్జహాన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి, జడ్‌పిటిసి పద్మజాలోకవర్ధన్, వైసిపి జిల్లా కార్యదర్శి హరి, మండల ప్రత్యేక ఆహ్వానితులు శివయోగి శివాజీ, రత్న శేఖర్‌రెడ్డి, సర్పంచులు రెడ్డివారి వెంకటరెడ్డి, గంగయ్య, కలికిరి మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ నూరున్నిషా, కో-ఆప్షన్ మెంబెర్ రిజ్వాన్, ఎంపిటిసి శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** మాజీ జడ్పీటీసీ చింతల శివానందరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చౌడేశ్వరి దేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రామక్రిష్ణారెడ్డి, వైస్ ఎంపిపిలు వెంకట్రమణ, కిరణ్‌కుమార్, నాయకులు అబ్దుల్‌కలీమ్, కేశవరెడ్డి, సైపుల్లా, రఘు, చికెన్‌మస్తాన్, మధనమోహన్‌రెడ్డి, ఆనంద, శివారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, రాజన్న, సత్తిపండు, శీను, ఫారుఖ్ పాల్గొన్నారు. **పీలేరు:** కె.వి.పల్లి జడ్‌పిటిసి గజ్జల శృతి ఆధ్వర్యంలో గర్నిమిట్టలో వైస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసిపి మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల యూత్ కన్వీనర్ గజ్జల శీనురెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు వెంకటరమణ, రామకొండారెడ్డి, ఉప సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు వేణురెడ్డి, ఆనందరెడ్డి, గౌస్, హరి, రవి, యల్లయ్య, క్రిష్ణయ్య, చలపతి, ఫయాజ్, సురేష్ పాల్గొన్నారు. **పీలేరు:** ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జాండ్లలో సర్పంచ్ నీలిమ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష పాల్గొన్నారు. **రాయచోటి టౌన్:** సంక్షేమ పథకాలకు జగన్ ప్రజా సంకల్పయాత్ర నాంది పలికిందని ఎంఎల్ఎ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు వైఎస్ జగన్ ప్రజా సంకల్ప యాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు ఫయాజ్ బాష, ఫయాజుర్ రెహమాన్, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు వండాడి వెంకటేశ్వర్లు, తబ్రెజ్ ఖాన్, మాజీ ఎంపిపి పోలు సుబ్బారెడ్డి, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, హాబీబుల్లా ఖాన్, బేపారి మహమ్మద్ ఖాన్, జాకీర్, ఫయాజ్ అహమ్మద్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి:** మండల కన్వీనర్ చౌడేశ్వర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలతో పూజల నిర్వహించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ఆర్బికే చైర్మన్ రెడ్డిమల్ రెడ్డి పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడు హొదాలో పట్టణంలోని జ్యోతి చౌక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఎస్.ఫయాజ్, మాజీ ఉప సర్పంచ్ మాలిక్, నక్కా మహేష్, బీరంగి ఎంపిటిసి యల్లప్ప, ఉప సర్పంచ్ శంకర, నాయకులు రమణ, పవన్ మధుకర్‌రెడ్డి, సమీవుల్లా, సాబు, సాదిక్ వల్లి, రమేష్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుదాం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా వ్యతిరేకత పాలనకు చరమగీతం పాడుతామని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాయుడు కాలనీలో టిడిపి నాయకులు బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతి అక్రమాలు, ధరల పెంపుదల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దారిద్రరేఖకు దిగువనున్న కుటుంబాల జీవనం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి నాయకులు భూ కబ్జాలు, మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. సామాన్యులకు ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్ వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి ,బీసీ సెల్ కన్వీనర్ శివప్రసాద్ నాయుడు గుట్టబాబుటి) టిఎన్ఎస్ఎఫ్ సాయి ప్రతాప్ , కొట్టే చలపతి, సోనీరాజ్ ఖలీమ్, జావిద్ అక్తర్, జాబీర్, రెడ్డయ్య, గన్‌మెన్‌రాజు, రఘు, ఇలియాజ్, గంగాధర్, జామీద్, బసిరెడ్డి, డేరెంగుల రామక్రిష్ణ, హాజీ ముబాకర్, జిజపవన్ కుమార్ రాజు, కిరణ్, ఖదీర్ కుమార్, మన్సూర్, రెహమాన్ పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

గిరిజన మహా ధర్నాను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న గిరిజన నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గిరిజన ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర గిరిజన సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు కోనేటి దివాకర్‌రావు పిలుపు నిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ, వాల్మీకి, బెంతో, ఒరియా కులాలను గిరిజన జాబితాలో చేర్చాలని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం గత నెల 19వ తారీఖున విశ్రాంతి ఐఎఎస్ అధికారి శ్యాముల్ ఆనంద్ కుమార్‌తో ఒక ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసి జీవో నెంబర్ 52 తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ జీవోని ప్రభుత్వం వెంటనే రద్దుచేసి వెనక్కి తీసుకోవాలని, గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చరాదని ఈ మహా ధర్నా కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు పేర్కొన్నారు. గిరిజన నాయకులు బండి రమణ మాట్లాడుతూ ఈ మహాధర్నా కార్యక్రమానికి గిరిజన ఆదివాసి అడవి బిడ్డలు గిరిజన తండాలు గూడాలు గ్రామాల నుండి వేలాదిగా తరలి వచ్చి ఈ ప్రభుత్వానికి గిరిజన సత్తా ఏంటో మన ద్వారా తెలియజేస్తూ ప్రతి ఒక్క గిరిజన బిడ్డ మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన కుల సంఘ నాయకులు యానాది గంగులప్ప, శేషాద్రి, గంగాధర్, విశ్వ, అరవింద్, రామచంద్ర, రామాంజులు, లక్ష్మీనారాయణ, వీరాంజనేయులు, వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సిఎం చేయూత : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్ చేయూతనిస్తున్నారని తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పెద్దతిప్పసముద్రం మండలం తుమ్మరకుంటలో గుట్టపైన ఉన్న శివాలయ నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయ శాఖ నుంచి రూ.40 లక్షలు మంజూరు చేయించి, గుడి నిర్మాణ భూమిపూజ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఆలయాలు, ఆధ్యాత్మిక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారని, ఇందుకోసం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారని కొనియాడారు. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆలయాలకు మహర్దశను తీసుకొచ్చామన్నారు. దక్షిణ కైలాసంగా ప్రసిద్ధిగాంచిన తంబళ్లపల్లె మల్లయ్య కొండలో ఆలయ నిర్మాణం, అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మల్లయ్య కొండ ఆలయ అభివృద్ధి నియోజకవర్గ ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేర్చమన్నారు. కార్యక్రమంలో పెద్దతిప్ప సముద్రం మండలం ఎంపిపి మహమ్మద్, జడ్‌పిటిసి శివన్న, మార్కెట్ డైరెక్టర్ డైరెక్టర్ అయూబ్ బాషా, మండలంలోని ప్రజాప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రజా సేవలే 'లయన్స్' ప్రస్థానం

కడప అర్బన్ : ప్రజాసేవలే ప్రధానంగా లయన్స్ క్లబ్ ప్రస్థానం సాగుతోందని లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ ఒన్- చైర్మన్ షేక్ అబ్దుల్లా పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాజంపేట ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో సంస్థ రీజియన్ గ్లోబల్ యాక్షన్ టీం సమావేశం నిర్వ హించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన షేక్ అబ్దుల్లా మాట్లా డుతూ సంస్థ సభ్యులంతా సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. మన తరువాత తరాలకు సైతం స్ఫూర్తిగా నిలవా లన్నారు. వారసులకు ధనం కంటే మంచి నడతనే ఇవ్వడమే మంచిదన్నారు. ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ ఎంజెఎఫ్ లయన్ చంద్ర ప్రకాష్ రావు మాట్లాడుతూ లయన్స్ జిల్లా ఎపి విభాగంలో నంబర్ 1గా నిలిచామని తెలిపారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె. చిన్నప రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథ రెడ్డి, రాజంపేట అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, టి. లక్ష్మినారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వి. గౌరి శంకర్, పద్మప్రియ చంద్రా రెడ్డి, ఓంశాంతి పవన్, బి. కొండా రెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, శివశంకర్ రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి జనార్ధన రాజు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సిసిటివిలో కనిపిస్తున్న దొంగ తనం చేస్తున్న వ్యక్తి

వరుస దొంగతనాలు.. భయాందోళనలో ప్రజలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు, దుకాణాల యజమానులను భయభ్రాంతులకు గురవుతున్నారు. అర్ధరాత్రి సమయంలోనే వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. గురువారం మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. శుక్రవారం ఎటిఎం సెంటర్లు, శనివారం రాత్రి ఆర్ఎస్ రోడ్డులోని బాలాజీ బేకరీ, ఏ-1 చికెన్ సెంటర్, కె.పి.ఆర్ బట్టల షాపులో చోరీ జరగడంతో పట్టణంలోని ప్రజలు తీవ్రంగా అభద్రతా భావానికి లోనవుతున్నారు. దొంగలు దుకాణాల తాళాలు, షట్టర్లు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. రాత్రి వేళల్లో పోలీసులు నిరంతరాయంగా గస్తీ తిరుగుతున్నా పోలీసుల కళ్లుగప్పి దొంగలు తమపని తాము చేసుకుపోతున్నారు. పట్టణంలో వరుస దొంగతనాలతో షాపుల యజమానులు లబోదిబోమంటున్నారు. ఈ దొంగతనాలకు సంబంధించి పట్టణ పోలీసులు ప్రత్యకంగా నిఘా ఉంచి దొంగలను పట్టుకునే దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. దీనికి సంభందించి సిసి టిడి పుటేజీని పరిశీలించి దొంగను పట్టుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఐతే ఈ వరుస దొంగతనాలకు పాల్పడుతున్నది ఒక్కరేనా, వేర్వేరు వ్యక్తులా అన్నది తేలాల్సి ఉంది.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-రామాపురం

అన్ని దానాలలో అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ రాయచోటి బ్రాంచ్ అధ్యక్షులు షేక్ మొహమ్మద్ అన్నారు. శిబ్యాల గ్రామం, రెడ్డి వారిపల్లి చెందిన బొడ్డెడ్డి మహిత, సాయి ప్రతాప్ రెడ్డి దంపతుల కుమార్తె నివ్రితి రెడ్డి మొదటి పుట్టిన రోజు సందర్భంగా బండపల్లి పంచాయతీ పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ వృథాశ్రయంలో అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు తమ లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన, పెళ్లి రోజు వేడుకలు, ఇతర శుభకార్యాలకు డబ్బులు వృథా చేసుకోకుండా ఇలా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. దాతలు మాట్లాడుతూ తమ కుమార్తె సావిత్ర రెడ్డి మొదటి పుట్టిన రోజు పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్, బిఎంఆర్ నాగిరెడ్డి, లయన్ వెంకట చలపతి, ఆశ్రమ సిబ్బంది, దేవనాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ ఓటు నమోదును అరికట్టాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లె

ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో అక్రమ ఓటు నమోదును అరికట్టాలని పిడిఎస్‌యు సహాయ కార్యదర్శి అంకన్న పేర్కొన్నారు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అక్రమాలు జరగకుండా ప్రజాస్వామ్య బద్ధకంగా జరపాలని కోరారు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అడ్డదారిలో అక్రమాలకు పాల్పడుతున్నారని, అలా జరకుండా జిల్లా అధికారులు చొరవచూపాలని పేర్కొన్నారు. సమావేశంలో పిడియస్‌యు జిల్లా నాయకులు స్వరూప్ తేజ, మండల నాయకులు శ్రీనివాసులు, నాగార్జున పాల్గొన్నారు.

క్రైం కార్నర్


పట్టుబడిన సారాతో ఎస్ఇబి, పోలీసు బృందం

25 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పీలేరు ఎస్ఈబి సిఐ వై.గురుప్రసాద్ తెలిపారు. ఆదివారం తమకు అందిన రహస్య సమాచారం మేరకు మండలంలోని మర్రిమాకులపల్లి తాండా పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 25 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ లక్ష్మినరసయ్య, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

ప్రజాశక్తి - నందలూరు

మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలోని టంగుటూరు రోడ్డు లో ఉన్న కీర్తి మెడికల్ స్టోర్‌లో ఆదివారం మధ్యాహ్నం రూ.పది వేల నగదు చోరీకి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. కీర్తి మెడికల్ షాప్‌లో పనిచేస్తున్న విజయ్ అనే వ్యక్తి మధ్యాహ్నం భోజనానికి వెళ్తూ క్యాష్ బాక్స్‌కు తాళాలు వేసి పక్క బాక్స్‌లో పెట్టి భోజనానికి వెళ్ళాడు. ఇదే అదునుగా దొంగ మందుల దుకాణంలోకి చొరబడి క్యాష్ బాక్స్ తాళాలు తెరిచి నగదు చోరీ చేసి తీసుకెళ్లాడు. మొత్తం ఈ దృశ్యం మందుల దుకాణంలోని సిసి కెమెరాలో నిక్షిప్తమైంది. యజమాని ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలించి ఈ చోరీపై దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఇటీవల చోరీకి గురైన మూడు ద్విచక్ర వాహనాల దొంగలను ఆదివారం అర్బన్ పోలీసులు అరెస్టు చేసి వాహనాలను స్వాధీనపరచుకున్నారు. కొలిమి వీధికి లోని దిలీప్‌కు చెందిన టివిఎస్ స్టార్ సిటీ, అదే వీధికి చెందిన సయ్యద్ ముస్తాక్ అహ్మద్‌కు చెందిన హోండా యూనికార్న్, బోయపాలెంలోని మనోహర్‌కు చెందిన హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిళ్లను వరుస దొంగతనాలకు పాల్పడిన ఈడిగ పాలెంకు చెందిన ఖాలేశా, తన కుమారుడు షేక్ ఉమర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని దొంగతనాలకు పురికొల్పిన సుబ్రహ్మణ్యంను కూడా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు అర్బన్ సీఐ నరసింహారావు తెలియజేశారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ లక్ష్మిప్రసాద్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలతో పోలీసులు